# "కల్లు మరిసిల్లు-గుళ్ళు మరిసిబళ్ళు సూడాలె"

**బ**తుకమ్మ పండుగ మా తెలంగాణల తప్ప మొత్తం దేశంలనే ఎక్కల్లేదు. గీ పండుగంటిక్కడోల్లకు బాగ సంబురం. ఎంత గతిమాల్నోడైన[69] బిడ్డెనింటికి తీసుకపోతడు. అవ్వగారింటికి పోవుటానికి ఆడోల్లు ఎదురుసూసుకుంటుంటరు. తోడబుట్టిన అన్నో, తమ్ముడో తోలుకపోను రాంగనే మస్తు ఖుసీ ఐతరు. ఆడోల్లేమొ పండుగ కవ్వగారింటికి పోవుటానికి సంబురపడుతంటె మొగోల్లేమో పెండ్లాన్నిడిసుండుటానికి బాద పడ్తరు. గమ్మత్తేందంటె తన సెల్లెనత్తగారింటికాన్నుంచి తోలుకరావాలనే మొగోడే పెండ్లాన్ని ఆల్లవ్వ గారింటికి పంపుటానికి తఖలీఫయితదంటడు.[70] అయినా గని గీ పండుగకు పంపకతప్పది. ఎంతెల్లకున్నా అప్పు సప్పయిన జేసి అందరికి ముక్కెంగ ఆడోల్లకు కొత్త బట్టలు కొంటడు ఇంటెజమాని. ఎంత లేనాడిదయిన పండుగనాడు కొత్తసీర తప్పక కడ్తది.

అంతకుముందు ఆయుటి పూనినంక పెట్టిన పూలసెట్లు పెరిగి పండుగవారకు మంచిగ పూలు పూత్తయి. గవ్వి రోజు తెంపుకుంట సిబ్బులల్ల బతుకమ్మ పేర్చి ఆడుకుంటరు. పొద్దందాక ఎవుసప్పనులకు, కూలిపనులకు పొయ్యొచ్చి మాపటీలి గీ బతుకమ్మాడుతరాడోల్లు. కొన్ని రోజులు బొడ్డెమ్మ, అటెనుక ఎంగిలి పువ్వులేసి చిన్న బతుకమ్మాడుతరు. బతుకమ్మ పాటల్తోటి ఊరంత నిండిపోతది. ఏ వాడకు సూసినా ఉయ్యాల పాటలే. ఇద్దరక్క సెల్లెండ్ల పాట, సారంగధరుని పాట, వానదేవుని పాట గిట్ల అరొక్కపాట ఖుషీపడుకుంట ఒగలు ముందుగాలంటె మిగుతోల్లు ఎనుకందుకోని పాడుతరు. సిన్న బతుకమ్మలయినంక ఇగ దసుర రేపన్న ఎల్లుండన్న ఉంటదనంగ పెద్ద బతుకమ్మాడుతరు. ఇగ గానాడయితె ఆడోల్ల సంబురం, ఉరుకులాట, హడావిడి సూసుటానికి వశెంగాదు.

అంతకుముందు రొండ్రోజులు ముందుగాల్నే తంగెడుపువ్వు తెచ్చుకోని గంపలల్ల దాసుకుంటరు. పండుగనాడయితె పెద్ద నాత్తిరి లేత్తరు. పువ్వులు జమజేత్తరు. గుమ్మడిపూలు, కట్లపూలు, బంతిపూలు, గోరంట్లపూలు, గునుగుపూలు, పార్వతిపూలు గిట్ల ఎన్ని తీర్ల పువ్వులు దొరుకుతె గన్ని తీర్లయి జమజేత్తరు. ఒగల బతుకమ్మకన్న ఇంకొగల బతుకమ్మ పెద్దగుండన్నని సూత్తరు. రొండు మూడు గంటలు కూసుండి బతుకమ్మ పేర్తరు. మా ఊల్లె మా కర్నపయినె బతుకమ్మే అందరాటికన్న పెద్ద గుండేడిది. మాపటిలాక అన్ని పనులు ఇగ కొత్తసీరెలు కట్టుకుంటరాడోల్లు. అటుదిద్ది, ఇటుదిద్ది సింగారిచ్చుకుంటరు. రెడ్డోల్లు, బామ్మండ్లు, కోమటోల్లు, బందవస్తున్నోలంత పట్టు పీతాంబురాలసొంటియి గట్టుకుంటరు. ఇగ బీదోల్లు వాయిల్సీరలో, ఊల్ఊల్ సీరెలో, నేసిన సీరెలో కట్టుకుంటరు. ఎల్లినోల్లు-

నగలు గూడ సేయించుకొని పెట్టుకుంటరు. ఇగ ఊరుమంది ఎప్పలాడకాల్లు ఓ కాడ బతుకమ్మలు పెట్టుకోని కొంతసేపాడుకుంటరు. అటెనుక డప్పుల సప్పుడుతోని ఊరోల్లంత సెరువుకట్ట దగ్గెరున్న మైదానంలకు పోతరు. అక్కడ గుంపులు గుంపులుగ జేరి బతుకమ్మలు పెట్టుకోని ఇగ పాటందుకుంటరు. రాగాల్దీసుకుంట, సప్పట్లు కొట్టుకుంట, బతుకమ్మలచుట్టు తిరుక్కుంట మస్తు పాటలు పాడుతరు. అటెనుక కొంచెమంత సీకటయినట్టు కాంగనే బతుకమ్మలను కొంచవొయ్యి చెర్లేత్తరు.

అటెనుక సిబ్బుల్లోని ఇచ్చుకో పుచ్చుకోవైనాలాడ్తరు. సద్దుల ముల్లెలిప్పి ఒగలయొగల కిచ్చుకుంటరు. పల్లిముద్దలు, నువ్వులపిండి, బియ్యప్పిండి, సత్తుపిండి గిట్ల నాలుగైదు తీర్ల సద్దుల్తోని వదినె మరుదండ్ల వరులున్నోల్లు పరాశికాలాడుకుంటరు. తీరుతీర్ల సద్దులు సేసెపటికె గీ పండుగను సద్దుల పండుగని గూడంటరు. అటెనుక "మీ ఇంటెనుకా మా ఇంటెనుకా ఏమేమి గుడ్డలు పెడుదామక్కా! ఓ రాచ్చ గుమ్మాడీ!" అని పాటలు పాడుకుంట ఇంటికత్తరు. సద్దులు, బువ్వ తిని పండుకుంటరు. ఎంతున్నోడైన గీ సద్దులపండుగనాడు నీసు ముట్టడు.

నాగ్గీ పండుగంటె సిన్నప్పట్నుంచి గూడ బాగిట్టం. మా సెల్లె కోసురం పండుగనాడు మబ్బుల్లేసి పొలాలల్లున్న ఎనుగులపొంటి[71] తిరిగి కట్లపువ్వులు, సెలుకల పొంటి తిరిగి గునుగుపువ్వులు, పార్వతి పూలు తెంపెకచ్చెటోన్ని. రొండ్రోజులు ముందే గుట్టకు తిరిగి తంగెడుపువ్వు పంచెల కట్టుకచ్చెటోన్ని. కాల్లకు రాల్లు గుచ్చినా ముండ్లిరిగినా గీ పనులయితె సేసెటోన్నే. ఆడోల్లు బతుకమ్మాటలు ఆడుతంటె దూరం నిల్సుండి వినెటోన్ని. నా సోపతి పోరగాండ్లు కొందరు కంకగొట్లాలల్ల కాయిదాలు మలిసిపెట్టి ఆడుకుంటున్న ఆడోల్లను గొట్టెటోల్లు. అవ్వి దాకితె ఆడోల్లు దినాలు. వారాలు సేత్తనని తిట్టెటోల్లు. అల్లు తిడుతాంటె పోరగాండ్లు సంబురపడుకుంట అల్లకు దొరుకకుంట ఉరికెటోల్లు. గిప్పుడు గసొంటియేం లెవ్వు.

నేనెప్పుడైన గీ పండుగకు మా ఊరికే పోత. గీ పండుగకు ఎక్కడెక్కడ నౌకరి జేసిటోల్లంత గూడ ఊళ్ళెకత్తరు. అందర్తోని కలిసి మాట్లాడచ్చు. సిన్నప్పటి సోపతికాల్లతోని మస్తు బైసు చెయ్యాచ్చు. గందుకే గీ పండుగకు దేశెం కిందుమీదయినా మా ఊళ్ళెనే ఉంట. యాట పెయినట్టే ఆ ఏడు గూడ పండుగకింటికి పెయిన. ఆడోల్లు సెరువుకట్ట కాడుకుంటండ్రు. మొగోల్లంత అక్కడక్కడ నిల్సుని మాట్లాడుకుంటండ్రు. కొందరు పతంగులెగిరేత్తండ్రు. ఎవుసం సేసుకునే ఐదారుగురు ఓ కాడ మాట్లాడుకుంటుంటె నేనాల్ల దగ్గెరికి పొయ్యి నిల్సున్న. మాటలు నడుత్తన్నయి.

"ఇగ మనూరు బాగుపడదె" అన్నడొగాయినె.

"ఏమయిందూరుకు, మంచిగనే ఉందిగద"

"మన్ను మంచిగుందా?" ఇదో ఊరా తియ్యి!"

"పచ్చ కామిండ్లోనికన్ని పచ్చగనే కనవడ్తయి"

"నీ తలుకాయ నీకేమెరుక తియ్యి. గొండ్లోల్ల పనే నయ్యం. శాక్రిన్ పొడి కలుపుతె కల్లే కల్లు"

ఇగ మాదేసుకం పటు. తాడుమీదుంటె స్వర్గం కనబడ్తది. ఇంకొంచెం కాల్జరితె కతమేనాయె. మా ఆడోల్లతోనంత పరాశికమాడిరి. ఊరు......."

"ఏమయింద్రర మీకు.....? సాకల్దాని సండ్లకు సన్నాసోడు కొట్లాడినట్టు ఊరూరని కొట్లాడుతండ్రు. గీ పండుగ నాడెందుకు లొల్లి" అక్కడి కచ్చుకుంటో ముసలయినన్నడు.

గా మాటలెవ్వలిన్లే.

"ఇంత కేమైందూరుకు మల్లేషు." అన్న నేను.

"ఆనత్తె కూలెతట్టుండె గా బడి. గదాన్నెవ్వడన్న మంచిగ సేత్తనంటుడున్నడా? తొవ్వెంబడి మొకాలుమంటి దిగువాటాయె. గిదేమన్నూరేనా?" అన్నడు.

"అబ్బో పట్నంల పుట్టచ్చిండు పొల్లగాడు. సిమిటి[72] సడుకులు గావన్నాయె" కారెడ్డ మాడిందొగయినె.

"మంట్లె బతికె నాకు సిమిటి రోడ్డెందుకుగ్గని. మనూరోల్లకు తాగుడుంటేది పట్టది. పొద్దంగుతున్నదంటె ఇగ గోసులు సదురుకుంట తాల్ల దిక్కురుక వచ్చుకునుడేనాయె. ఇంట్లేం లేకున్నా మంచిదే గని తాగుడైతె తప్పదాయె. ఇగెవ్వలు ఊర్ను గురించెందుకాలోసిత్తరు? గా బడిని గురించి పట్టించుకునెటోడెవ్వడన్నున్నడా?" అన్నడు మల్లేషు.

"పొద్దుందనుక కట్టపడెటోడో బొట్టు తాగుతేం బోయిందోయ్ మల్లేషు?"

"ఇగ గదే కడుపు నింపుతదా? గదాన్తోనెన్ని సంసారాలు పాడయిపాయె. గా బడికి సెందాలియ్యమంటె ఎవ్వడొక్క పైసన్నియ్యకపెయ్యిరి. తాగుటానికైతె పెట్టిరి. మల్ల గుడికంటె పదివేలు జమాయె. నాయకుడులేని తండయిందూరు. ఈ ఊరుకు మోచ్చం లేదు".

"మరి ఊరెట్ల బాగుపడ్తదంటవు మల్లేషు" అన్న నేను.

"ఎట్ల బాగుపడుతదంటె" కొంచెం సేపాలోచించి "ఊరోల్లంత కల్లు మరిసిల్లు, గుళ్ళు మరిసి బల్లు సూసినప్పుడు బాగుపడ్తది" అన్నడు.

గాయిదోనోలె[73] కనిపిచ్చె మల్లేషు మాటల్లోని లోతు గురించాలోసించుకుంట బతుకమ్మను సెర్లేసుటానికి పెయిన.

★ ★ ★